
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 30 । జూన్ । 2025



'వాగు'.. బాగు చేయరూ..?

గతేడాది పెదవాగు ప్రాజెక్టు కట్ట భారీగా కోతకు గురికాగా, ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు.

8లో



అతివలకు అండగా 'సఖి'

మహిళలపై గృహ హింస, వరకట్న వేధింపులను నిరోధించేందుకు సఖి వన్‌స్టాప్ సెంటర్ కృషి చేస్తోంది.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా భక్తులు దర్శించుకుని అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, భక్తులు బోనాలు, సారె సమర్పించారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయకమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కిన్నెరసానికి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. రోజంతా సరదాగా గడిపారు. 537 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.29,100 ఆదాయం లభించగా, 250 మంది బోటుషికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.14,060 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

గోదావరి పుష్కరాలకు ప్రణాళికే కీలకం



2015 పుష్కరాల్లో భద్రాచలంలో పుణ్యస్నానం చేస్తున్న భక్తులు

2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు పుష్కరాలు

- కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
- ఇంకా ప్రణాళిక, నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా మంత్రులు దృష్టి సారించాలని వేడుకోలు

భద్రాచలం: భక్తులు మహా పవిత్రంగా భావించే గోదావరి పుష్కరాలకు రెండేళ్ల సమయమే ఉంది. 2027లో జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నట్లు షెడ్యూల్ కూడా ప్రకటించారు. కోటి మందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యాల కోసం ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. మహారాష్ట్రలోని నాసిక్ వద్ద ఉన్న త్రయంబకంలో పుట్టిన గోదావరి నిజామాబాద్ జిల్లా రేంజర్ మండలం కందకుర్తి వద్ద తెలంగాణలో ప్రవేశిస్తోంది. ఆదిలాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించి భద్రాచలం దిగువన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ద్వారా అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. గోదావరి రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 180 కిలోమీటర్లు ప్రవహించగా, విభజనం అనంతరం ఏపీలో ఏడు మండలాలు విలీనం చేయటంతో ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 70 కిలోమీటర్లు ప్రవహిస్తోంది.

ప్రణాళిక ప్రకటించని ప్రభుత్వం

2027లో పుష్కరాలను విజయవంతం చేయాలంటే కనీసం రెండేళ్ల ముందు నుంచే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా స్నాన ఘాట్ల పెంపు, రోడ్ల వెడల్పు, ఆలయ పరిసర ప్రాంతాల విస్తరణ, భక్తులకు శాశ్వత, తాత్కాలిక వసతుల కల్పన వంటి పనులు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ ముందస్తు పనులకు రూ.50 కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఘాట్ల పెంపు, ఇతర మౌలిక వసతుల కల్పనకు, శాశ్వత పనులకు ఇంకా నిధులు అవసరమవుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఈ పుష్కరాల పనులపై సమీక్ష, బడ్జెట్‌తో ప్రణాళిక ప్రకటించారు. తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ఏ ప్రకటనా వెలువడలేదు. పుష్కరాలను ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని ప్రణాళిక, నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

గతంలో 2015లో..

పన్నెండేళ్లకు ఒకమారు జరిగే పుష్కరాలు 2015 జూలై 14 నుంచి 25 వరకు జరిగాయి. మళ్లీ 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, పర్ణశాల, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాల్లో భక్తులు పుష్కర స్నానం చేయనున్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికి అత్యధిక భక్తులు తరలివస్తుంటారు. గత పుష్కరాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 70 లక్షల మంది భక్తులు హాజరయ్యారని పేర్కొంటుండగా, 2027లో కోటి మందికి పైగానే భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం, పర్ణశాల, మోతె తదితర ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

ముందస్తు ప్రణాళిక ప్రకటించాలి



2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాలను విజయవంతం చేయాలంటే ముందస్తు ప్రణాళిక ఎంతో కీలకం. నేను 2003, 2015 పుష్కర స్నానాలను భద్రాచలంలోనే చేశాను. భక్తుల రద్దీ, గత అనుభవాల దృష్ట్యా అన్ని శాఖల అధికారులను ముందస్తుగా అప్రమత్తం చేసి ఏర్పాట్లు చేయాలి.

– పరిమి సోమశేఖర్, భక్తుడు

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను లిఖిత పూర్వకంగా అందజేయాలని పేర్కొన్నారు.

మెలకువలతోనే వ్యాపారాభివృద్ధి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలంటౌన్: గిరిజన యువత మెలుకువలు తెలుసుకుని వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న గిరిజన యువతులతో మాట్లాడారు. అనంతరం పీఎంఆర్సీ కార్యాలయాన్ని, శ్రీరామ జాయింట్ లయబిలిటీ మిల్లెట్ బిస్కెట్ యూనిట్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభిరుచికి తగినట్లు దుస్తులు డిజైనింగ్ చేయాలని, ముక్కోటి, శ్రీరామనవమి పండుగల సమయాల్లో దుస్తుల విక్రయాలకు వెసులుబాటు కల్పిస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్త డిజైన్లపై శిక్షణ ఇప్పిస్తామని, కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు ఎంబ్రాయిడరీ మిషన్ ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని రకాల సంక్షేమ పథకాల పెయింటింగ్ డిజైనింగ్ వేయించాలని పీఎంఆర్సీ సిబ్బందికి సూచించారు. మిల్లెట్ బిస్కెట్ల ఘనత జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లి ఐటీడీఏ పేరును ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించి ప్రశంసలు కురిపించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మిల్లెట్ బిస్కెట్లకు అవసరమయ్యే రాగులు, సజ్జలు ఇక్కడి పొలాల్లోనే పండించుకోవాలని సూచించారు. అనంతరం మిల్లెట్ బిస్కెట్ తయారీని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రస్తావించినందుకు కృతజ్ఞతగా పీఓ బి.రాహుల్, ఏఎస్పీ, విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మలకు మహిళలు మిల్లెట్ బిస్కెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సున్నం రాంబాబు, ఈఈ హరీష్, ఏసీఎంఓ రమేష్, శ్రీనివాస్, ఆదినారాయణ, నరసింహారావు, జేడీఎం హరికృష్ణ, మిల్లెట్ బిస్కెట్ తయారీదారులు వెంకటలక్ష్మి, లలిత, మంగ వేణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, పీఓ, అధికారులకు మిల్లెట్ బిస్కెట్లను అందజేస్తున్న మహిళలు

ఉచిత కేన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరం

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్ క్లబ్, వికాస తరంగిణిల ఆధ్వర్యంలో ఆదివారం నర్సింగ్ కళాశాలలో ఉచిత కేన్సర్ నిర్ధారణ, చికిత్స, నేత్ర శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, సికింద్రాబాద్‌కు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించగా, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణకు శిబిరాలు దోహదం చేస్తాయని అన్నారు. 650 మందికి కంటి చూపు పరీక్షలు నిర్వహించి, 326 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. పలువురికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీఓ కె.దామోదర్‌రావు, ఎంపీఐ వెంకట పుల్లయ్య, రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు, ఎ.జగదీష్, డాక్టర్ బి. సుబ్బరాజు, డాక్టర్ జయభారతి, కేన్సర్ వైద్య నిపుణులు, ప్రజ్ఞా, కమలా రాజశేఖర్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరికి జలకళ

భద్రాచలంటౌన్: కొత్తనీరు రావడంతో భద్రాచలం వద్ద గోదావరి జలకళ సంతరించుకుంది. గతవారం వరకు ఏడారిని తలపించిన నదిలో ఇటీవల కురిసిన వర్షాలకు కొత్త నీరు ప్రవహిస్తోంది. వారం రోజులుగా సరిహద్దు రాష్ట్రాల్లో వర్షాలు భారీగా కురుస్తుండటంతో ఎగువన ఉన్న ప్రాజెక్ట్‌లకు వరద నీరు చేరుతుండటంతో, అక్కడి నుంచి దిగువకు వదులుతుండగా గోదావరిలో వరద నీరు పెరుగుతోంది. గోదావరిలో జలప్రవాహంతో కరకట్టపై సందర్శకులతో సందడి నెలకొంది.



భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు

డిగ్రీ.. డీలా

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు తగ్గుతున్న ఆదరణ
- దోస్త్ గడువు ముగిసినా సగం సీట్లు ఖాళీ
- జిల్లాలోని ఆరు కాలేజీల్లో మూడింటికే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు
- గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల్లాలోనూ భర్తీకాని సీట్లు



పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాల్వంచరూరల్: అడ్మిషన్లు లేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు డీలా పడుతున్నాయి. డిగ్రీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. సంప్రదాయ డిగ్రీ కోర్సులపై విముఖత చూపుతున్నారు. అడ్మిషన్ ప్రక్రియ దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ) గడువు ముగిసినా కాలేజీల్లో సగం సీట్లు కూడా భర్తీ కాలేదు. జిల్లాలో కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇక పాల్వంచ, అంకంపాలెంలలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల డిగ్రీ కళాశాల, కొత్తగూడెంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం, మణుగూరులో గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. కాగా దమ్మపేట మండలంలోని అంకంపాలెం గిరిజన బాలికల గురుకులాన్ని రెండు, మూడేళ్ల క్రితం అశ్వారావుపేటలోని పెదవాగుకు తరలించారు. జిల్లాలో ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా, పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందులలోనే రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ ఉన్నారు. మిగిలినచోట్ల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్‌తో నెట్టుకొస్తున్నారు. విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు మొగ్గు చూపడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు వెలవెలబోయే పరిస్థితి నెలకొంది. ఏటేటా అడ్మిషన్ల సంఖ్య తగ్గుతుండగా, ఈ ఏడాది అధికంగా తగ్గుముఖం పట్టాయి

డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల భర్తీ ఇలా..

	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	ఖాళీలు	గతేడాది భర్తీ
ప్రభుత్వ కళాశాలలు				
పాల్వంచ	660	313	347	420
కొత్తగూడెం	420	177	243	134
భద్రాచలం	840	311	529	470
మణుగూరు	360	120	240	180
ఇల్లెందు	300	80	220	134
అశ్వారావుపేట	280	289	191	303
గురుకుల కళాశాలలు				
కొత్తగూడెం	280	103	177	142
పాల్వంచ	280	172	108	200
మణుగూరు	280	160	120	200
పెదవాగు	280	88	192	62

పాల్వంచలో అధికంగా భర్తీ..

2025–2026లో మే 30వ తేదీ నుంచి దోస్త్ ప్రక్రియ మొదలైంది. మొదటి విడత ఈ నెల 9 వరకు, రెండో విడత 13 నుంచి 19 వరకు, మూడో విడత 23 నుంచి 28 వరకు నిర్వహించారు. రేపటి నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభంకానున్నాయి. మూడు విడతలుగా అడ్మిషన్లు చేపట్టినా విద్యార్థులు నామమాత్రంగానే చేరారు. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నా ఆదరణ లేదు. పాల్వంచలోని కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు ప్రత్యేక శ్రద్ధతో ప్రచారం చేపట్టగా జిల్లాలోని మిగతా కాలేజీలకంటే అధికంగా విద్యార్థులు చేరారు. జిల్లాలోని 10 డిగ్రీ కళాశాలల్లో3,980 సీట్లు ఉండగా, ఇప్పటివరకు1,813 మంది చేరారు. ఇంకా2,167 ఖాళీలు ఉన్నాయి.

విద్యార్థుల చూపంతా ఇంజనీరింగ్ వైపే..

విద్యార్థులు అధికంగా ఇంజనీరింగ్ విద్యవైపే ఆసక్తి చూపుతున్నారు. దీంతో డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ కావడంలేదు. గతంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధిస్తేనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు లభించేవి. సీట్ల కోసం పైరవీలు కూడా చేసేవారు. కానీ క్రమంగా అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. కాగా ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తయితే, అక్కడ సీట్లు రాని విద్యార్థులు డిగ్రీలో చేరే అవకాశం ఉంది. దీనికితోడు అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్ కూడా చేపడ తామని, ఇంకా చేరనివారు ఎవరైనా ఉంటే వినియోగించుకోవచ్చని ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు.

ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు..



విద్యార్థులు ఎక్కువ మంది ఇంజనీరింగ్ విద్యవైపే ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టణాల్లోని ప్రైవేటు కళాశాలల వైపు వెళ్తున్నారు. దీంతో ఏజెన్సీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది.

–పద్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పాల్వంచ

గురుకులాల్లో అన్ని సౌకర్యాలు..



గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే కల్పిస్తోంది. పైసా ఖర్చు లేకుండా చదువుకోవచ్చు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఉపకార వేతనాలు కూడా అందే అవకాశం లేదు.

– పి.అనురాధ, ప్రిన్సిపాల్, కొత్తగూడెం గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల

అడ్డంకిగా మారిన జీఓ 15

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొరుగు రాష్ట్రాల విద్యార్థుల చేరికకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 15 అడ్డంకిగా మారింది. ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలోని సరిహద్దు ప్రాంతాల విద్యార్థులు భద్రాచలం, పాల్వంచ వచ్చి చదువుకునేవారు. జీఓ 15తో ఆ అవకాశం లేకుండా పోయింది.

డిగ్రీ కళాశాలలు	గురుకులాలు	సీట్లు	భర్తీ అయినవి	ఖాళీలు
6	4	3,980	1,813	2,167

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్ర మంత్రి తుమ్మల వినతి



అమిత్ షాకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న మంత్రి తుమ్మల

భద్రాచలం: పునర్విభజనలో భాగంగా ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఏపీలో కలిపిన భద్రాచలం చుట్టుపక్కల గ్రామాలైన ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నంలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరారు. వీటివల్ల పరిపాలన, అభివృద్ధి పనుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భద్రాచలం, ఇతర మండలాల మధ్య రవాణా అంతరాయం ఏర్పడుతోందని, భద్రాచలంలో చదివే గిరిజన విద్యార్థులకు రాకపోకల్లో ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు.

మోడు కాదు తోడు!



ఈ చిత్రాన్ని చూడగానే వ్యవసాయ క్షేత్రంలో అలంకరణ కోసం పెట్టినట్లుగా కనిపిస్తున్నాయి కదా! అశ్వారావుపేటలోని నందమూరినగర్ నుంచి పేటమాలపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఓ రైతుకు వ్యవసాయ క్షేత్రం ఉంది. కొన్నేళ్లు సాగులో ఉన్న కొబ్బరి తోట ముదిరిపోగా దీన్ని తొలగించే క్రమాన వృక్షాల మోడులను అలాగే వదిలేశారు. వీటి మధ్య ప్రస్తుతం అరటి పంట సాగు చేస్తున్నారు. భవిష్యత్‌లో పందిరి, తీగ జాతుల తోటలు సాగు చేస్తే ఈ మోడులు ఆలంబనగా నిలుస్తాయని అలాగే వదిలేసినట్లు తెలుస్తోంది. – అశ్వారావుపేట రూరల్

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

అశ్వారావుపేట రూరల్: గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సాయిబాబా మందిరాల్లో 11రోజుల పాటు అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. వేడుకల్లో భాగంగా గురువులను, పెద్దలను పూజించే రోజును గురుపూర్ణిమ లేదా వ్యాస పూర్ణిమ అంటారు. వేద వ్యాసుడిని మానవులంతా గురువుగా భావిస్తారు. గురుపౌర్ణమి రోజున ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. మరి కొందరు సత్యనారాయణ స్వామి వ్రతాలు కూడా ఆచరిస్తారు. ఈ వేడుకలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు సాయిబాబా ఆలయాలు, మందిరాల్లో ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

జూలై 5న కౌన్సెలింగ్



సింగరేణి(కొత్తగూడెం): నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 150 సీట్ల భర్తీ కోసం సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల పిల్లలు ఈ నెల 28 నుంచి 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలని యాజమాన్యం ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపింది. సివిల్–30, కంప్యూటర్–30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్– 30, మెకానికల్–30, మైనింగ్–30 సీట్లు ఉన్నా యని, https:# scp. scpolytechnic. com/ online& admission వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసి, కాపీని డౌన్‌లోడ్ చేసి, సంభందిత గని, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీతో అటెస్టేషన్ చేయించి జూలై 5వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొంది. వివరాల కోసం 90102 22161, 87901 12515, 94911 44168 నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

నేడు 10 మంది అధికారుల ఉద్యోగ విరమణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 10 మంది అధికారులు సోమవారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. వారిలో ఐదుగురు జీఎంలు ఉన్నారు. జీఎం ఈఅండ్ఎం (సోలార్) జీఎస్ జానకీరామ్, జీఎం ఈఅండ్ఎం (ట్రాన్స్‌పోర్ట్) జె.నాగరాజు, కార్పొరేట్ ఏరియా ఆడిట్ జీఎం (ఎఫ్ అండ్ ఏ) గొర్రెపాటి వెంకటరమణ, జీఎం ఆర్అండ్‌డీ నారాయణరావు, హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఎంఎం విభాగంలో జీఎం ఈఅండ్ఎం ఎన్‌వీ రాజశేఖర్, డైరెక్టర్ ఈఅండ్ఎం అడిషనల్ జీఎం కామిశెట్టి వెంకటేశ్వరరావు, కార్పొరేట్ సివిల్ డీవైజీఎం (సివిల్) రాజశేఖర్, కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ ఏజీఎం (ఐఈ) గోనే శ్రీకాంత్, మెయిన్ ఆస్పత్రి డీవైసీఎంఓ డాక్టర్ టి.రవీంద్ర, కార్పొరేట్ పర్సనల్ విభాగం సీనియర్ పీఓ తీటి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేయనున్నారు.

మృతుడి వివరాలు లభ్యం



కుసిన సాయి (ఫైల్)

దమ్మపేట: పామాయిల్ క్షేత్రంలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించారు. శనివారం మండలంలోని మందలపల్లి శివారులోని పామాయిల్ క్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం విదితమే. కాగా మృతుడి వివరాల కోసం పోలీసులు, మృతదేహం ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఈ మేరకు ఏపీ, ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కుసిన వెంకటేశ్వరరావు, పాంచాలి దంపతులు మృతదేహం ఫొటో చూసి అశ్వారావుపేట మార్చురీలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి, తమ కుమారుడు సాయి (21)గా గుర్తించారు. కాగా మృతుడు అవివాహితుడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి తల్లితండ్రులకు అప్పగించారు. విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై ప్రత్యేక బృందంతో దాడులు చేపట్టారు. రూ.2,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

'వాగు'.. బాగు చేయరూ..?

- పెదవాగు ప్రాజెక్టుకు గండి పడి ఏడాది
- సమావేశాలు.. సందర్శనలు.. ప్రతిపాదనలతో సరి..
- ఇప్పటివరకు నిధుల కేటాయింపు శూన్యం
- ఇక వర్షాధారంతోనే పంటలు వేసుకోవాలా?



గండి పడిన పెదవాగు ప్రాజెక్టు (ఫైల్)

అశ్వారావుపేట: అశ్వారావుపేట, ఏపీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామాల కల్పతరువు పెదవాగు ప్రాజెక్టు. 1981 నుంచి ప్రాజెక్టుకు దిగువనున్న ఆయకట్టు గ్రామాలు పంటలతో కళకళలాడేవి. గతేడాది జులై 18న వచ్చిన క్లౌడ్‌బరస్ట్‌కు పెదవాగు ప్రాజెక్టు కట్ట 250 మీటర్ల మేర కోతకు గురైంది. పలు చోట్ల కట్టలు దెబ్బతిన్నాయి. దీంతో గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం గ్రామాల్లో 71 నివాస గృహాలు దెబ్బతినగా, 391 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. అనంతరం ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రాజెక్టును సందర్శించారు. కానీ, ప్రయోజనం శూన్యమే. కంటితుడుపుగా రింగ్‌బండ్ నిర్మించినా.. నాణ్యతాలోపాల కారణంగా దానికి కూడా గండ్లు పడుతున్నాయని సమాచారం. నీటినిల్వలు పెరిగితే రింగ్ బండ్ కొట్టుకుపోతుందని ఆయకట్టు రైతులు, గుమ్మడవల్లి వాసులు ఆందోళన చెందుతున్నారు.

నిధులు లేవు..

సందర్శనలు, సమావేశాలు,అంచనాలు తప్ప నిధు ల కేటాయింపు మాత్రంలేదు. 80శాతం ఆయకట్టు ఏపీలో ఉండటంతో 80శాతం నిధులు సమకూర్చుతామని జీఆర్ఎంబీ సమావేశంలో అంగీకరించి నా.. కదలిక లేదు. ప్రాజెక్టు సామర్థ్యం 20 వేల క్యూ సెక్కులు కాగా ప్రస్తుతం రింగ్‌బండ్ సామర్థ్యం కేవలం 1.8వేల క్యూసెక్కుల లోపే. వరదఉధృతి ఎక్కువగా ఉన్నా.. రింగ్ బండ్ నిలిచి ఉంటుందనే నమ్మకం లేదు. ఏపీ ప్రభుత్వం 82శాతం నిధులు జీఆర్ ఎంబీకీ చెల్లిస్తే పనులు మొదలవుతాయని రైతులంటున్నారు.

సందర్శనలు..

- గతేడాది జులై 21వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెదవాగు ప్రాజెక్టును సందర్శించారు.
- అదే నెల 22వ తేదీన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టును పరిశీలించి.. పునఃనిర్మిస్తామని ప్రకటించారు.
- అదే నెల 26వ తేదీన రూ.3.5 కోట్ల వ్యయంతో తాత్కాలిక రింగ్ బండ్ నిర్మాణానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.
- ఆగస్టు 31వ తేదీ నాటికి రింగ్‌బండ్ నిర్మాణాన్ని పూర్తి చేసి నీరు నిల్వ చేశారు.
- సెప్టెంబర్ 1వ తేదీన కురిసిన భారీ వర్షంతో రింగ్‌బండ్‌కు భారీ గండి పడి 30 మీటర్ల దాకా కొట్టుకుపోయింది.
- ఈ ఏడాది మార్చి 17వ తేదీన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్, మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు పెదవాగు ప్రాజెక్టును సందర్శించారు. అదే రోజు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ కూడా వచ్చారు.
- ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీన హైదరాబాద్‌లో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం నిర్వహించారు. తెలంగాణతోపాటు ఏపీకి చెందిన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు (ఇంజినీర్ ఇన్‌చీఫ్ అనిల్‌కుమార్, వెంకటేశ్వరరావు) హాజరయ్యారు. గండ్లు పూడ్చేందుకు రూ.19 కోట్లు అవసరమని గుర్తించారు.

నీరు అందుతుందనే నమ్మకం లేదు..



కట్ట కొట్టుకుపోయి ఏడాది అవుతోంది. నాట్లయితే వేసుకున్నాం. వర్షం వస్తే వరి పండినట్లు. రింగ్ బండ్ తెగకుండా ఉంటే కాల్వకు ఆనుకుని ఉన్న కొందరికి నీరందే అవకాశం ఉంది. పూర్తిగా నీరు అందుతుందనే నమ్మకం లేదు.

–వల్లెపు తిరుపతిరావు, రైతు, గుమ్మడవల్లి

ఏడాది ఖాళీగా ఉన్నాం



అధికారులు, రాజకీయ నాయకుల మాటలు వింటూ ఏడాది ఖాళీగా ఉన్నాం. ఏపీ, తెలంగాణ నుంచి వచ్చిన వారు మెట్ట పంటలు, మునగ సాగు చేయమన్నారు. నర్సరీలు పెట్టమన్నారు. కానీ ప్రాజెక్టు పూర్తి కాదని మాత్రం గ్రహించలేదు.

–సీహెచ్.వెంకటేశ్వరరావు, రైతు, గుమ్మడవల్లి

ఏపీ నిధులు వస్తే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం..

జీఆర్ఎంబీ సమావేశంలో ప్రాజెక్టుకు కావాల్సిన మరమ్మతులు, అందుకు కావాల్సిన నిధుల వివరాలను ఉన్నతాధికారుల ముందుంచాం. ఏపీ నుంచి జీఆర్ఎంబీకీ 82 శాతం నిధులు డిపాజిట్ చేస్తే పనులు ప్రారంభిస్తాం.

–కృష్ణ, ఇరిగేషన్ డీఈఈ

'సతత్ వికాస్'పై అవగాహన

- జాతీయ అవార్డుల దరఖాస్తు ప్రక్రియకు కసరత్తు
- క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



జిల్లాస్థాయి అవార్డు అందుకుంటున్న చల్లసముద్రం గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ (ఫైల్)

ఇల్లెందురూరల్: పంచాయతీలను మరింతగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ పేరుతో 2021–22 నుంచి అవార్డులు ఇస్తోంది. ఈ ఏడాది కూడా జాతీయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణకు కసరత్తు ప్రారంభించింది. దరఖాస్తు ప్రక్రియపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా, మండలస్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశారు. ప్రస్తుతం ఎంపీడీఓలు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో అంశంలో ఉత్తమ గ్రామపంచాయతీ, మండలం, జిల్లా పరిషత్‌ను ఎంపిక చేయనున్నారు. కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులో పొందుపర్చిన అంశాలను పరిశీలించనున్నాయి. కాగా, త్వరలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుంది.

తొమ్మిది అంశాలు.. 147 ప్రశ్నలు

ప్రధానంగా తొమ్మిది అంశాల్లో కేంద్ర ప్రభుత్వం వార్డులు ప్రదానం చేయనుంది. ఆయా అంశాల పరిధిలో 147 ప్రశ్నలకు పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. మెరుగైన జీవనోపాధి, వైద్యసేవలు, ఇంటింటికి తాగునీరు, పచ్చదనం, పరిశుభ్రత, మహిళా సంఘాలకు రుణాలు, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళల సమస్యల సాధన, హక్కుల పరిరక్షణ అంశాల్లో అవార్డులు ఇవ్వనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వ అవార్డులకు దరఖాస్తు ఎలా చేసుకోవాలి, ఏఏ అంశాలపై స్పష్టత ఉండాలి, నిబంధనలు, పరిశీలన ప్రక్రియ ఎలా ఉంటాయనే అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నాం. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యేలోగా కార్యదర్శులను సన్నద్ధం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ధన్‌సింగ్, ఇల్లెందు ఎంపీడీఓ

పేకాట రాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: మండల పరిధిలోని ఎలకంవారిగుంపు శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేసి 12 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.35 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. 12 సెల్‌ఫోన్లు, 5 బైక్‌లు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు.

అధికారం కోసమే బీజేపీ దైవజపం

- మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో మాట్లాడుతున్న కూనంనేని

నేలకొండపల్లి : అధికారం కోసమే బీజేపీ రామ జపం, దైవ జపం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని మోటాపురంలో ఆదివారం జరిగిన సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. దేవుడి పేరుతో ప్రజలను వంచిస్తోందని, మతం మాటున ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీకి అధికార ధ్యాసే తప్ప దేశభక్తి లేదన్నారు. దేశం కోసం బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల అభ్యున్నతి, హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, త్యాగాల చరిత్ర తమ సొంతమని అన్నారు. కార్పొరేట్ల కోసమే పనిచేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సంపద సృష్టి కోసం కొత్త మార్గాలు అన్వేషించాలని ప్రభుత్వానికి సూచించారు. మావోయిస్టులను హతమార్చడానికి అమిత్‌షా వంటి వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలోకి రావాలని కోరారు. సీపీఐ శత వసంతాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో చారిత్రిక సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు హేమంతరావు, మహ్మద్ మౌలానా, దండి సురేష్, జితేందర్‌రెడ్డి, కర్ణకుమార్, కర్నాటి భానుప్రసాద్, రామ్మూర్తి, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, రాంకోటి, కాశిబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, మల్లెబోయిన ఉపేందర్, సీతారాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పాల్వంచ: స్థానిక గొల్లగూడెం ఏరియాలోని ఓ గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫంక్షన్‌హాల్ నుంచి గొల్లగూడెం వెళ్లే రోడ్‌లో మూలమలుపు వద్ద ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులుదాడి చేశారు. కాగా, ఎందరిని అదుపులోకి తీసుకున్నారనే విషయం తెలియరాలేదు. ఎస్‌ఐసుమన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. సీఐ సతీశ్ వివరణ కోరగా తనకు తెలియదన్నారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన అనితకు మహబూబాబాద్ జిల్లా దోర్నకల్‌కు చెందిన మల్సూర్‌తో 2021లో వివాహమైంది. కొంతకాలంగా భర్త మల్సూర్, అత్త, మామ కలిసి అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ మల్సూర్ భార్య అనిత ఆదివారం కొమరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

కార్పొరేట్ విద్యను నియంత్రించాలి

భద్రాచలంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యవస్థలను నియంత్రించి ప్రజలకు విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు కోరారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు తమ సంపాదనలో సుమారు 70 శాతం పైబడి విద్య, వైద్యానికి ఖర్చు చేస్తున్నారని, దీంతో ఆర్థికంగా ఎదగలేక పేదలు మరింత పేదలుగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో జి.హరిలాల్, ఎం.రామాచారి, జె.రాంబాబు, టి.సత్తిబాబు, జి.గంగరాజు తదతరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడు మృతి

సింగరేణి(కొత్తగూడెం): రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిమ్మల రాంచందర్ (56) ఆదివారం మృతి చెందారు. కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ఓసీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్ అనారోగ్యంతో మృతిచెందారు.

అతివలకు అండగా 'సఖి'

- రెండేళ్లలో 565 కేసులు.. 216 పరిష్కారం
- అత్యధికంగా గృహహింస కేసులే..
- ఫిర్యాదుల స్వీకరణకు అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్ 181





బుస్కికల్మ – సాతిమండల్ దంపతులతో సఖి సెంటర్ బాధ్యులు (ఫైల్), (ఇన్‌సెట్) సఖి సెంటర్‌లో బుస్కికల్మని పరామర్శిస్తున్న అనితారామచంద్రన్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: సమస్యల్లో ఉన్నామని మహిళలు ఫోన్ చేస్తే చాలు.. అండగా సఖి సెంటర్ నిర్వాహకులు ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా 2023 మే నుంచి 2025 మే వరకు 565 కేసుల్లో బాధితులు సఖీ సెంటర్‌కు ఫిర్యాదు చేశారు. వాటిలో 216 కేసులు రాజీ కాగా, మిగిలినవి విచారణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. కొత్తగూడెంలో సఖి వన్ స్టాప్ సెంటర్‌ను మొదటగా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో 2019లో ఏర్పాటు చేశారు. 2025లో ప్రస్తుతం కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాల వద్ద సఖి సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గృహ హింస, వరకట్న వేధింపులు, ఆస్తి తగాదాలు, వయోవృద్ధులు, ప్రేమించి మోసానికి గురైన బాధితులకు ఆశ్రయం కల్పిస్తూ, పోలీసుశాఖతో పాటు న్యాయ సేవలు, కౌన్సెలింగ్‌తో వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. తాత్కాలిక వసతితో పాటు అత్యవసర సరిస్థితుల్లో బాధిత మహిళలకు వాహన సదుపాయం కల్పిస్తున్నామని సఖి సెంటర్ అడ్మిన్ జులుమూరి సుభశ్రీ తెలిపారు.

రెండేళ్లలో నమోదైన కేసులు

జిల్లావ్యాప్తంగా రెండేళ్లలో 565 కేసులు నమోదు కాగా అత్యధికంగా గృహ హింస కేసులు 402 ఉన్నాయి. వరకట్న వేధింపులు–18, లైంగిక వేధింపులు–6, బాల్య వివాహాలు–2, బాలికలపై లైంగిక వేధింపులు (పోక్సో)–3, ఆస్తి తగాదాలు, వయోవృద్ధులు, ఇతర సమస్యలు–94, మోసం, ప్రేమ పేరుతో మోసగించడం కేసులు–40 ఉన్నాయి. వాటిలో రాజీ అయిన కేసులు–216, విచారణ దశలో–311, శక్తి సదన్, ఇతర గృహాలకు పంపిన కేసులు–38 ఉన్నాయి. అవగాహన సదస్సులు–311 వరకు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

సక్సెస్ స్టోరీ..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన బుస్కికల్మ, సాతిమండల్‌తో కలిసి భద్రాచలంలోని సారపాకకు గత నవంబర్‌లో వచ్చారు.కూలీ పనులు చేస్తూ సహజీవనం చేశారు. మహిళ గర్భం దాల్చింది. ఇంట్లో అమ్మను పెళ్లికి ఒప్పించి తీసుకెళ్తానని చెప్పి వెళ్లిన సాతిమండల్ తిరిగి రాలేదు. గర్భిణికి స్థానిక కారం చిట్టెమ్మ ఆశ్రయం కల్పించింది. అంగన్‌వాడీ టీచర్ గర్భిణిగా ఉన్న విషయాన్ని మే 4న.. ప్రసవించిన విషయాన్ని మే 19న ఐసీడీఎస్ అధికారులకు తెలిపింది. సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, సఖి సెంటర్ అడ్మిన్ సుభశ్రీ, హరికుమారి బృందం చేరుకుని విచారించారు. సదరు మహిళ, బిడ్డను సఖి సెంటర్‌కు తరలించారు. సాతిమండల్ వివరాలు సేకరించి గ్రామస్తుల సాయంతో సఖి సెంటర్‌కు తీసుకువచ్చి పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. యువతిని పెళ్లి చేసుకుని తీసుకెళ్లేందుకు సాతిమండల్ అంగీకరించాడని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. కాగా, గత మే 29న బుస్కికల్మను ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ అనితారామచంద్రన్ పరామర్శించారు.

కష్టాల్లో ఉన్న వారికి భరోసా



ఆపదలో ఉన్న మహిళలు ఫోన్ చేస్తే సహాయం చేసి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తాం. రెండేళ్లుగా 565 కేసులు నమోదు కాగా అందులో అత్యధికంగా భార్యభర్తలు విడిపోతామంటూ ఆశ్రయిస్తున్నారు. అందులో ఎక్కువగా వరకట్న వేధింపుల కేసులు ఉన్నాయి. వేధింపులకు గురైన వారు టోల్ ఫ్రీ నంబర్ 181, లాండ్‌లైన్ 08744 – 248222, సెల్ నంబర్ 86880 05934కు సమాచారం అందించాలి.

–జులుమూరి సుభశ్రీ, అడ్మిన్, సఖి వన్‌స్టాప్ సెంటర్

థమ్సప్ అనుకుని గడ్డిమందు తాగిన బాలుడు



అంబులెన్స్‌లో తల్లితో వరుణ్‌తేజ

కరకగూడెం: థమ్సప్ అనుకుని ఓ బాలుడు గడ్డిమందు తాగిన ఘటన మండలంలోని చొప్పల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాడి నవీన్ – వరలక్ష్మి దంపతుల కుమారుడు ఐదేళ్ల వరుణ్‌తేజ ఆదివారం ఉదయం ఇంట్లో ఆడుకుంటుండగా.. థమ్సప్ బాటిల్‌లో పోసిన గడ్డిమందు కనిపించింది. అయితే దాన్ని థమ్సప్‌గా భావించిన బాలుడు కొంత తాగాడు. కాసేపటికి కడుపునొప్పితో బాధపడడంతో నోరు వెంట నురగలు వస్తూ వాంతి చేసుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు ఆటోలో కరకగూడెం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి 108 ద్వారా మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గంజాయి పట్టివేత

పాల్వంచ: కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ సతీశ్ వివరాలు వెల్లడించారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం స్థానిక రెజీనా కాన్వెంట్ సమీపంలో ఎస్‌ఐ సుమన్ వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన కారు ను ఆపేందుకు యత్నించగా.. అందులో నుంచి ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. మరో ముగ్గురితోపాటు 11.100 కేజీల గంజాయి పట్టుబడింది. వారు చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన కందిమళ్ల శ్రీహరి, జొన్నలగడ్డ రాకేశ్‌రెడ్డి, బోనకల్ మండలం ముష్టికుంట్లవాసి ఎస్‌కే జావిద్‌గా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

యూరియా తిని 11 మేకల మృతి



మృతి చెందిన మేకలు

ములకలపల్లి: యూరియా తినడంతో 11 మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని మంగపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మంగపేట గ్రామానికి చెందిన వాడె దారయ్యకు చెందిన మేకలు గ్రామశివారులో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో ఓ రైతు ట్రాక్టర్‌లో యూరియా బస్తాలు తరలిస్తుండ గా ఒకటి రోడ్డుపై పడటంతో యూరియా కిందపడింది. సమీపంలో ఉన్న 11 మేక లు యూరియా తిని మృతి చెందాయి. సుమారు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.